


మిట్ట మధ్యాహ్నం—

మండు వేసవికాలం...

ఎండ మాడ్చేస్తోంది - చెట్లని, చెట్ల ఆకుల్ని, పక్షుల్ని, పక్షుల రెక్కల్ని, మనుషుల్ని సమానంగా మాడ్చేస్తోంది.

ఇంట్లో ఉంటే వేడి, ఉక్కబోత, చెమట, చిరాకు, బైటికివెడితే నెత్తిమీద, మొకంమీద, చేతులమీద, కాళ్ళమీద సూదుల్తో గుచ్చుతున్నట్టు, ముళ్ళతో పొడుస్తున్నట్టు ఎండ, ఎండ, ఎండ..

"నిన్న నూటిరవై డిగ్రీలు...

ఈవేళ మరో రెండు ఎక్కువే ఉంటుందేమో...?"

"ఉండొచ్చు."

"ఏం ఉక్కబోతండీ బాబూ - ఆటు పడుకుంటే ఇటు చెమట పట్టేస్తోంది - ఇటు పడుకుంటే అటు చెమట పట్టేస్తోంది."

"మరే!"

"ఏర్‌కూలర్ కొంటానన్నారు—నిరుడూ కుదర్లేదు-ఈ యేడూ కుదర్లేదు."

"............"

"ఈ ఉక్కకి పిల్లలు అసలు పడుకోడం లేదు-పాపం చెప్పుకోలేరు బాధ."

"అవును..."

"వచ్చేఏడైనా ఎల్లాగో అల్లాగా ఏర్‌కూలర్ తీసుకోవాలి."

"అల్లాగే"

కాసేపు నిద్రపడితే బావుండును

పెళ్ళాం ఈసోది మానేస్తే బావుండును.

ఎండ తగ్గితే బావుండును.

ఉక్కలేకుండా ఉంటే బావుండును.

వచ్చేఏడైనా ఏర్‌కూలర్ కొనగలిగితే బావుండును.

జీవితం విస్తరిస్తే బావుండును.

పిల్లలు లేవకుండా ఉంటే బావుండును...

బావుండును - బావుండును-బావుండును.

టక్, టక్ — టకటకా.

"మన తలుపే - ఎవరో వచ్చారు తియ్యండి...."

(అవును మన తలుపే - ఎవరు? సూన్నారాయణ కాదుకదా - వచ్చాడంటే వదల్డు-వీడికన్నా నెత్తిమీద సూన్నారాయణ మూర్తే నయం. రాజేశ్వర్రావు కాదు కదా-నెల్లో ఆఖరి ఆదివారం అని తెల్సీ డబ్బు అప్పడగుతాడు — 'లేవు మొర్రో అంటే—' 'అహ—లేకుండా ఉంటాయా చూడుగురూ-' అంటాడు. ఇంటి ఓనరు కాకుండా ఉంటే బావుండును—కరెంటు ఎక్కువ కాల్చారనో, రోజూ అందరూ నీళ్ళు పోసుకుంటున్నారనో, అద్దె పెంచమనో అంటాడు-

ఏమో — ఎవరో — ఎవరైనా తలుపు తియ్యడం తప్పదు — నెత్తిమీద కొట్టించుకోడం తప్పదు).

ఉస్..ఉక్కబోత..ఉస్..తలుపుతీశాను.

ఎదురుగా చంద్రం.

అతన్ని చూడగానే ఎండ తగ్గింది, వేడి తగ్గింది. ఉక్క తగ్గింది. చెమట తగ్గింది—

"రారా! ఏవిటి వేళప్పుడే...."

"ఏంలేదు- ఏంతోచట్లా- నువ్వు బైటికి వస్తానంటే...?"

ఎక్కడికి? ఎందుకు? ఎలా?

ఇలాంటి ప్రశ్నలు నోట్లోంచిరావు అతన్ని చూస్తే, బట్టలేసుకుని అయిదు

నిముషాల్లో బైట పడ్డాను. గేటుదాటి అతని స్కూటర్ దగ్గరికి వచ్చాక "ఇందిరా పార్కుకి వెడదాం - వె ప్పుడు నాలుగు బీర్లు కొనిపట్టుకపోదాం-రా త్రి కథ రాశాను, వినిపిస్తాను"

'ఒకే-ఒకే-'ఎంతహాయి ఈరేయి నింపె నో?-చంద్రం చెప్పిన బీరు చల్లగా ఉంటుంది. ఇందిరాపార్కు, ఆహ్లాదం , చల్లగా ఉంటుంది. అతను చదవబోయే కథహాయిగా, ఆనందంగా, ఆహ్లాదంగా, చల్లగాఉంటుంది. "ఒకే-ఒకే"

o : o

పార్కులో ఎక్కడ చూసినా జంటలు, జంటలు, జంటలు, చెట్లకిం , గుట్టదగ్గర, పొదల మాటున, పొదల నతల-ఎక్కడ చూసినా రాధాకృష్ణులు, రతీమన్మధులు. ఎవర్నీ ఇబ్బంది పెట్టడం నాకిష్టంలేదు.

మొంటరు వేపిస్తుందగా ఎవరూ చూడ్డం, ఇబ్బందిగా ఫీలవడం మాకి ష్టంలేదు. అతను కథ చదువుతుంటే నేను వి టుంటే ఎవరెనా మమ్మల్ని డిస్టర్బ్ చెయ్య డం మాకసలు ఇష్టంలేదుగాక లేదుగాక ను-

అందుకనే మూలగా, మూలా మూలగా, ఎక్కడికో వెళ్ళి ఎవరికీ కనబడనంత దూరంగా కూర్చున్నాం.

బీరుసీసాలు ఓపెన్‌చేసాం, పకోడీల పొట్లాం, సిగరెట్ పెట్టెలు......అన్నీ ఎదురుగా పెట్టుకున్నాం. సీసాలు ఎత్తి చెరో గుక్క తాగాం.

చంద్రం కాయితాలు బైటికి తీశాడు. చదవడం మొదలెట్టాడు. "సు మ తి నడుస్తోంది." చదవడం ఆపి పక్కకి చూశాడు. అతనెందుకు చూశాడో తెలీక నేను అటే చూశాను

ఓ కుర్రాడు-

నల్లగా ఉన్నాడు. కిందకి జారిపోతున్న లాగూ తొడుక్కున్నాడు. తనకన్నా పదేళ్ళు పెద్దదయిన చొక్కా తొడుక్కున్నాడు. వయసు తొమ్మిది, పదిఏళ్ళు ఉంటాయి. పోషణలేక వయసుకుతగ్గ శరీరంలేదు. సన్నగా, పీలగా ఉన్నాడు. కళ్ళల్లో ఉత్సాహం ఉంది. ఆశ ఉంది.

మేమిద్దరం అటు తిరగ్గానే కుర్రాడు చెయ్యిచాచి మాకేసి చూశాడు

చంద్రం చిల్లరకోసం జేబు తడుముకుంటున్నాడు,

"పైసలొద్దుసార్"

"మరేంకావాలి?" చంద్రం అడిగాడు.

"ఖాళీసీసాలు ఇయ్యండి సార్"

నేను, చంద్రం ఒకరిముఖాల్లోకి ఒకళ్ళు చూసుకున్నాం. అసలు మేంఅక్కడున్నట్టు, మా సంచిలో సీసాలున్నట్టు వాడు పసిగట్టడమే గొప్ప అద్భుతం...

అదేమాట చంద్రంతో అంటే "ఏ పని మీద తిరిగేవాళ్ళు దాన్ని గురించే ఆలోచిస్తారు" అన్నాడు.

"అసలిలాంటి వాళ్ళని సి. ఐ. డి ల్లోకి తీసుకోవాలి" చంద్రం నవ్వాడు.

"సీసా తీసుకుపోయి ఏంచేస్తావురా?" చంద్రానికి రకరకాల మనుషుల్తో మాట్లాడడం సరదా.

"తాతకిస్తాన్"

"ఎక్కడుంటాడు?"

"అదిగో అటువైపు కూర్చునుంటాడు."

"అతను మీ తాతా?"

"కాదు సార్, ఖాళీసీసాలు కొంటాడు!"

"ఒక్కొక్క సీసాకి ఎంతిస్తాడు?"

"నాల్గణాలిస్తాడు..."

మేం బీరు తాగుతూనే ఉన్నాం.




ఉయనోరా
సాలిడార్
అప్‌ట్రాన్
ఇ.సి.
నికేతాషా

రాజ్‌కమల్ ఎలక్ట్రానిక్స్
చిక్కడపల్లి, పోస్టాఫీసువద్ద
హైదరాబాదు
ఫోను 61989.

రాజ్‌కమల్స్
రాజగోపాలాచారి రోడ్
జైహింద్ టాకీసు రోడ్
విజయవాడ
ఫోను : 63959.

సంభాషణ జరుగుతూనే ఉంది.

"రోజూ ఎన్ని సీసాలు పోగుజేస్తావ్ ?"

"ఇరవై దాకా దొరుకుతాయ్. ఆదివారమైతే ఇంకాసిని ఎక్కువ దొరుకుతాయి."

"తాతిచ్చిన పైసల్ ఏంచేస్తావ్ ?"

"మా అమ్మకిస్తా !"

"మీ అమ్మ ఏం జేస్తుంది"

"బాసన్లు (గిన్నెలు) తోముతుంది"

"మీ అయ్య ?"

"సచ్చిపోయాడు."

"సరె - పో - కొంచెంసేపునాక రా - అప్పుడిస్తా సీసాలు." చంద్రం చివరగా చెప్పేశాడు.

కుర్రాడు కదలకుండా అక్కడే గొంతు కూర్చున్నాడు.

"నిజంగా నీకేఇస్తా-పోయిమళ్ళీ రా !"

"ఈడనే కూర్చుంటా దొరా !"

"అయితే ఇవ్వను-పో పోయి మళ్ళీరా, ఇస్తాను." చంద్రం మాటల్లో కొంచెం కోపం కూడా చూపించాడు.

కుర్రాడు అక్కన్నుంచిలేచి వెళ్ళిపోయాడు.

"ఖాళీసీసా ఏభై పైసలకి కొంటారనుకుంటాను ?" చంద్రం అడిగాడు.

"ఆ, కొంటారు. ఆ తాత అనేవాడు ఈ కుర్రాళ్ళ దగ్గర పావలాకికొని తీసికెళ్ళి అర్ధరూపాయికి అమ్ముతాడు పెట్టుబడిమీద వంద శాతం లాభం బాగానే ఉందే !

చంద్రం నవ్వాడు.

మళ్ళీ కథ చదవడం మొదలెట్టాడు. కథ బావుంది. వినడానికి హాయిగ ఉంది. మాకు తెలియకుండానే మా సీసాలు ఖాళీ చేసేశాం.

"అవ్వి కూడా విప్పేసి కానిచ్చేద్దాం. ఈ ఎండకి వేడెక్కిపోతాయి." అన్నాడు చంద్రం.

"ఓయస్. 'ఆలస్యం బీరుం విషం' అన్నారు పెద్దలు."

మిగిలిన రెండు సీసాలు ఓపెన్ చేసాం. చంద్రం కథ చదవడం మళ్ళీ మొదలెట్టాడు.

సీసాల కుర్రాడు మళ్ళీ వచ్చాడు వాన్ని దగ్గరికి పిల్చి ఖాళీసీసాలు రెండు వాడికిచ్చాడు. వాడిమొహంలో ఆనంద . వాడి కళ్ళల్లో తళుకు రెండు సీసాలు చేతొచేత్తో పట్టుకొని హుషారుగా పరుగెత్తాడు. పరుగెతుతుంటే వాడిజేబులో చిల్లరడబ్బుల చప్పుడు స్పష్టంగా వినిపిస్తోంది.

చంద్రం కథ చదవడం పూర్తయింది.

కథ బావుంది. కాని ఒకచోట కొద్దిగా మారిస్తే చాలా బావుంటుందనిపించింది. ఆ విషయం అతనితో చెప్పాను. ఆవిషయమై ఇద్దరం చర్చించుకుంటున్నాం.

సీసాల కుర్రాడు మళ్ళీవచ్చాడు. కాని ఈసారి ఒక్కడూ రాలేదు. కూడా మరో కుర్రాన్ని తీసుకొచ్చాడు. కూడా వచ్చిన వాడికి ఏడేళ్ళుంటాయి. ఇంకాస్త ఎక్కువ అమాయకంగా ఉన్నాడు. బాగూ, చొక్కా వాడికి సరిగ్గా సరిపడ ఉన్నాయి పుష్టిగా, బాగానే ఉన్నాడు. పెద్ద కుర్రాడిలో కనిపించే సిరపం, వగైరా చిన్నకుర్రాడిలో లేవు.

"ఆ కుర్రాడెవర్రా" చంద్రం అడిగాడు.

"మా ఇంటిదగ్గర్లో ఉంటాడు"

"ఆ సీసాలు నాకియ్యన్నా" చిన్న కుర్రాడడిగాడు

"వద్దు, నాకే ఇయ్యి" పెద్దకుర్రాడడిగాడు

అప్పటికే మా దగ్గర రెండోజత సీసాలు ఖాళీ అయిపోయాం .

"ఇందాక నీకిచ్చాకదా, ఈ సారి వాడికిస్తా" చంద్రం పెద్దకుర్రాడితో అన్నాడు.

ఆ మాటలు వినగానే చిన్నకుర్రాడి మొహం విప్పారింది. వాడికళ్ళల్లో ఆశ తళుక్కున మెరిసింది.

పెద్ద కుర్రాడి మొహం ఫ్యూజుపోయిన బల్బులా పాడిపోయింది.

"అట్లా ఒద్దుసార్ ఇవి కూడా నాకే ఇచ్చెయ్ సార్ !" పెద్దకుర్రాడు బతిమాలుతున్నట్టుగా అన్నాడు.

"అరె, ఇందాక నీకిచ్చా కదా, ఈసారి వాడికిస్తా. పాపం చిన్నకుర్రాడు కదా."

చిన్న కుర్రాడు విజయవంతంగా చూశాడు. పెద్ద కుర్రాడు అసహనంగా చూస్తున్నాడు.

చిన్నకుర్రాన్ని పిల్చి రెండుసీసాలు వాడికందించాడు చంద్రం. వాడు ఆ సీసాల్ని ఎంతో జాగ్రత్తగా, పావురాలను పట్టుకున్నట్టుపట్టుకున్నాడు.

ఇద్దరూ అక్కన్నుంచి కదిలారు. పెద్ద కుర్రాడు చిన్నకుర్రాడి భుజంమీద చెయ్యివేసి మెల్లిగా నడిపించుకుని వెడుతున్నాడు పరిస్థితులకి రాజీపడినట్టుగా అనిపించాడు.

మేం కథ తాలూకు సంభాషణలో పడిపోయాం—

కెవ్వున కేక వినబడింది. పక్కకి తిరిగి చూశాం చిన్నకుర్రాడు కిందకూలబడి ఏడుస్తున్నాడు పెద్దకుర్రాడు సీసాలు రెండు చేతుల్లో పట్టుకుని పరిగెడుతున్నాడు.

చంద్రం చిత్రమైన మనిషి.

చెప్పులేనా వేసుకోకుండా పరుగెత్తుకెళ్ళి పెద్దకుర్రాణ్ని పట్టుకుని - వాణ్ని, చిన్నకుర్రాణ్ని మేం కూచున్న చోటుకి తీసుకొచ్చాడు.

"ఏమైందిరా చెప్పు." చిన్నకుర్రాణ్ని అడిగాడు.

"అంతదాక వెళ్ళినాక నన్ను కొట్టి సీసాలు లాక్కుని పారిపోయాడు." వాడు వెక్కుతూ చెప్పాడు.

"ఏరా - ఎందుకట్లా చేసావ్ ?" పెద్ద కుర్రాన్ని అడిగాడు.

"............"

"చెప్పు - ఇందాక రెండుసీసాలు నీకిచ్చాను కదా—ఈసారి వాడికిచ్చాను. అట్లా ఎందుకు లాక్కున్నావ్ - తప్పుకదా !" చంద్రం రీజనింగు మాట్లాడుతున్నాడు.

"పైసలొస్తాయి కదా - అందుకు లాక్కున్నాను." పెద్దకుర్రాడు చెప్పాడు.

"మరి వాడికీ పైసలొస్తాయి కదా-అన్నీ నువ్వే తీసేసుకుంటే ఎలా ?"

".............."

"తప్పుకదూ — వాడికీ పైసలు రావాలి కదరా !"

"ఆడికి పైసలెందుకు సార్-ఆడికి కూలిపనిచేసే అయ్యున్నాడు. మా అయ్య సచ్చిపోయాడు. మా కెక్కువ పైసల్ కావాలి కదా."

○ ○ ○

"ఈడుక్కకి పిల్లలు అసలు పడుకోడం లేదు. పాపం చెప్పుకోలేరు బాధ."

"అవును, మన పిల్లలు బాధ చెప్పుకోలేరు." ●

---

[మేం ఎప్పుడోగాని కల్సుకునేవాళ్ళం కాదు. అయినా—అతనీ ప్రపంచంలో ఉన్నాడంటే గొప్ప ధైర్యంగాఉండేది. — ఇప్పుడు లేడు. భయంగా ఉంది. బాధగా ఉంది.— ఆ 'వెంకటి' స్మృతికి-షమ్మి]